# న్యాయం మీరే చెప్పండి

**- పొట్లూరు సుబ్రహ్మణ్యం**




ఒంగోలు ఆర్టీసి బస్టాండు ఎక్కేవాళ్ళు, దిగేవాళ్ళతో కోలాహలంగా ఉంది. పోస్టాఫీసుల్లో ఉత్తరాల్ని తీసుకువెళ్ళే పెద్ద గోనెసంచుల్లా ప్యాసింజర్లను ఎక్కించుకొని వెళ్తున్నాయి కిటకిట లాడుతున్న బస్సులు. గట్టులు ఒరుసుకొని ఉధృతంగా ప్రవహిస్తున్న నదులు, గట్టు తెగినపుడు దుమికే నీళ్లలా బస్సు ఆగీ ఆగగానే తోసుకుంటూ క్రిందికి దిగుతున్నారు జనం.

హడావుడిగా వచ్చిన కార్తీక్ కదులుతున్న బస్సెక్కాడు. సీటుకోసం అతని కళ్లు బస్సంతా గాలించాయి. ఎక్కడా ఖాళీ కనిపించలేదు. ఇంతలో కొద్ది దూరంలో వెనుక సీటులోంచి ఒక పెద్దాయన చేయెత్తి పిలిచాడు. ఆయన్ని సమీపించాడు కార్తీక్. ఆయన తన ప్రక్కనే సీటు మీద వేసి ఉన్న టవలు భుజాన వేసుకున్నాడు.

"ఇంతకుముందు ఒకాయన సీటు ఉంచమంటే టవలు వేసి ఉంచాను. ఆయన బస్సెక్కలేదు. నువ్వు కూర్చోబాబూ" అన్నాడు.

కార్తీక్ హాయిగా ఊపిరి పీల్చుకొని అందులో కూర్చున్నాడు.

బస్సు వెళ్తూ ఉంది. పెద్దాయన తనను గురించి తాను పరిచయం చేసుకున్నాడు. తన పేరు కేశవయ్య అని, తనది ఒంగోలుకు పక్కనే ఉన్న ఒక పల్లెటూరని చెప్పాడు. తాను గుంటూరుకు పెళ్లికి వెళ్తున్నానని, తిరిగి సాయంత్రానికి వచ్చేస్తానని చెప్పాడు.

తరువాత "బాబూ... నువ్వేం చేస్తుంటావ్" అంటూ కార్తీక్‌ని అడిగాడు కేశవయ్య.

కార్తీక్ తాను పనిచేస్తున్న ప్రైవేటు కంపెనీ గురించి చెప్పి "నేను ఈ జిల్లా సేల్సు రెప్రజెంటేటివ్‌ని. నా జీతం గుంటూరు హెడ్ ఆఫీసులో ఇస్తారండి. ఈరోజు ఒకటవ తేదీ గదండీ. తెచ్చుకోవడానికి వెళ్తున్నాను" అన్నాడు.

"ఓహో అలాగా" అంటూ కార్తీక్ పనిచేస్తున్న కంపెనీ గురించి ఎన్నో విషయాలు అడిగాడు. తరువాత తను పల్లెలో చేసే వ్యవసాయం గురించి, అందులోని సాధకబాధకాల గురించి లాభ నష్టాల గురించి వివరిస్తూ ఎన్నో విషయాలు మాట్లాడాడు. కేశవయ్య కలుపుగోలుతనం కార్తీక్‌కి నచ్చితే కార్తీక్ వినయవిధేయతలకు ముగ్ధుడయ్యాడు కేశవయ్య. ఇద్దరూ బస్సుదిగే సమయానికి మంచి స్నేహితులయ్యారు.

బస్సు దిగిన వెంటనే కేశవయ్యను ప్రక్కనే ఉన్న హోటలుకు కాఫీకి ఆహ్వానించాడు కార్తీక్. అతని ఆహ్వానాన్ని మన్నించాడు కేశవయ్య. ఇద్దరూ కాఫీ త్రాగి బయటికి వస్తూంటే అడిగాడు కేశవయ్య.

"బాబూ... నువ్వెప్పుడు తిరిగి ఒంగోలు వెళ్తావ్?"

"నా పని రెండు గంటలకు అయిపోతుంది సార్. ఒంటిగంటకు హెడ్ ఆఫీసులో చెక్ తీసుకోవడం. రెండులోగా దాన్ని బ్యాంకులో క్యాష్ చేసుకోవడం. వెంటనే తిరిగి ఒంగోలుకు వెళ్ళిపోవడం."

"నే వెళ్ళే పెళ్లి ముహూర్తం ఒంటిగంటకు. పెళ్లిచూసుకొని భోజనాలు అయ్యేసరికి రెండు అవుతుంది. బస్టాండులో నాకోసం ఓ అరగంట చూడు. ఇద్దరం కలసి తిరిగి ఒంగోలుకు వెళ్దాం" అంటూ తను వెళ్లే పెళ్లి అడ్రసు చెప్పాడు.

"భలేవాళ్లు సార్. అరగంట కాకపోతే గంటసేపు ఎదురుచూస్తాను. మీరు వచ్చేదాకా బస్సెక్కను. ఇప్పుడు మీరు చెప్పిన ఆ కళ్యాణమండపం కూడా నేను చెక్ క్యాష్ చేసుకొనే బ్యాంకుకు దగ్గరే. నాపని ముందయితే నేనే మిమ్మల్ని అక్కడే కలుస్తాను.

ఇద్దరం కలిసి బస్టాండుకు వెళ్దాం" అన్నాడు కార్తీక్ ఆనందంగా.

"అలాగే అంటూ కేశవయ్య వీడ్కోలు తీసుకొని రిక్షా ఎక్కి ఒక రోడ్డువెంటపడితే, కార్తీక్ ఆటో ఎక్కి మరో రోడ్డున తన ఆఫీసుకు బయలుదేరాడు.

కార్తీక్ తన హెడ్ ఆఫీసుకు వెళ్లి ఆ నెలలో జరిగిన సేల్సు వగైరాలు వివరాలిచ్చి జీతం చెక్ తీసుకొని బ్యాంకుకు వచ్చి జీతం క్యాష్ చేసుకున్నాడు. బ్యాంకుకెదురుగా ఉన్న హోటల్లో భోంచేశాడు. కేశవయ్య ఒంటిగంటకు వివాహ ముహూర్తమన్నాడు. ఇప్పుడు ఒకటి యాభయి అయింది. కనుక వివాహమయిపోయి ఉంటుంది. కళ్యాణమండపం దగ్గరకు వెళ్లి, అక్కడనుంచి కేశవయ్యతో కలసి బస్టాండుకు వెళ్లదలచు కున్నాడు.

అనుకున్నదే తడవుగా అదే వీధిలో ఉన్న కళ్యాణమండపం వైపు నడిచాడు. కళ్యాణమండపం ముందు పెళ్లి కుమార్తె, పెళ్లి కుమారుని పేర్లు సూచిస్తూ "శ్యామలా వెడ్స్ నరేంద్ర" అన్న రంగు రంగుల బల్బులు వెలుగుతున్నాయి. బంధువులు చాలామంది వచ్చినట్లు లోపల కళ్యాణమండపంలో సందడిగా ఉంది. కార్తీక్ లోపల అడుగుపెట్టాడు. అది సందడికాదు. లోపల పెద్ద గలభా జరుగుతోంది. జనం అంతా నిలబడి గోలగోలగా మాట్లాడుతున్నారు. కార్తీక్ జనాన్ని నెట్టుకుంటూ వెళ్లి తొంగి చూశాడు.

"కట్నం రెండు లక్షలు చేతిలో పడితేనే అమ్మాయి మెళ్లో తాళి కట్టేది. లక్ష ఇచ్చి తరువాత మిగతాది ఇస్తానంటే ఎలా?" గర్జిస్తున్నాడు పెళ్లికుమారుడి తండ్రి.

దానికి ఔనన్నట్లు తల ఊపుతున్నాడు పెళ్లికుమారుడు. అతని చేతిలో తాళి ఉంది. అతని ప్రక్కనే అందాల భరిణ పెళ్లికుమార్తె కూర్చొని ఉంది. ఆమె సిగ్గుల మొగ్గయి పెళ్లికళ ఉట్టిపడాల్సింది పోయి నీళ్లు నిండిన కళ్లతో తలెత్తి అయోమయంగా చూస్తోంది "న్యాయం మీరే చెప్పండి?" అన్నట్లు.

పెళ్లి కుమార్తె తండ్రి బ్రతిమాలుతున్నాడు. "మొదట మనం అనుకొన్నది లక్ష. ముహూర్తాలు పెట్టుకున్న తరువాత అబ్బాయికి ప్రమోషను వచ్చింది. మరో లక్ష ఇవ్వమని పెళ్లిరోజు బలవంతం చేస్తే నేనెక్కడ తెచ్చేది బావగారూ. ముందు అమ్మాయి మెళ్లో అబ్బాయిని తాళి కట్టమని చెప్పండి" బ్రతిమాలుతున్నాడు పెళ్లి కుమార్తె తండ్రి.

పెళ్లి కుమారుడి తండ్రి మండిపడ్డాడు. "నీ బోడి సంబంధం ఎవడిక్కావాలి. ఇప్పుడు మావాడు

## నేనే దొరికానా?

**సినీ ఫీల్డుకి నేను ఒకరి రికమండేషన్‌తో రాలేదు. ఒకరి అండతో ఎదగలేదు. కేవలం నా స్వయంకృషితో పైకొచ్చాను.**

*నా ఆలోచనలు నావి. నా నిర్ణయాలు నావి. ఆ మాత్రం దానికి నేనేదో పెద్ద నేరం చేసినట్టు ఆడిపోసుకుంటారు దేనికి? అంటోంది అమీషా పాటిల్.*



ఆఫీసరయ్యాడు. వాడికిప్పుడు రెండు లక్షలు కట్నం ఇస్తామని ఎన్నో సంబంధాలు వస్తున్నాయి. మీ అమ్మాయి కాకపోతే మాకు పిల్ల దొరకదా" అరుస్తున్నాడు. అతనికి వంతపాడింది అతని భార్య.

ఇక లాభం లేదని పెళ్లికొచ్చిన పెద్ద మనుషులు కలుగ జేసుకొని ఎన్నో విధాలుగా పెళ్లి కుమారుడి తల్లిదండ్రులకు నచ్చజెప్పాలని చూశారు. కాని వాళ్లు ససేమిరా వినమన్నారు.

పెళ్లికుమార్తె స్నేహితురాళ్లు కొంతమంది అమ్మాయిలు లేచి నిలబడ్డారు. వాళ్లు పెళ్లికుమారుడ్ని, అతని తల్లిదండ్రుల్ని తీవ్రంగా దూషించారు.

"శ్యామలా లే! గ్రాడ్యుయేషన్ చదివావు. ఇలాంటి వాడ్ని చేసుకోవడానికి సిగ్గు లేదూ" అన్నారు పెళ్లికుమారుడివైపు అసహ్యంగా చూస్తూ. అతని ముఖంలో చిరునవ్వు తప్ప మరే స్పందనా లేదు.

శ్యామల లేవాల్నా వద్దా అని ఆలోచిస్తూ ఉంది. ఇంతలో శ్యామల తండ్రి ఆడపిల్లలందర్నీ శాంతింపజేసి కూర్చోబెట్టాడు. వాళ్లని కూర్చోబెట్ట గలిగాడేగాని ఏమి చేయాలో అర్థంగాక ఆలోచి స్తున్నాడు. ఆడపిల్ల పెళ్లి, పీటలమీద ఆగితే జరగ బోయే భయంకర అవమానం అతని కళ్లముందు మెదలుతోంది. అతని భార్యా, మిగతా కుటుంబ సభ్యులూ కుళ్లి కుళ్లి ఏడుస్తున్నారు.

జరుగుతున్న బాధామయ సంఘటనల్ని చూస్తున్న కార్తీక్ మనసుకూడా చలించింది. అయితే ఒంటిగంటకు జరగవలసిన వివాహ కార్యక్రమం జరగకపోవడానికి కారణం కట్నం సమస్య అన్నమాట. బంగారంలాంటి ఆడపిల్ల భవిష్యత్తు బుగ్గిపాలు అవుతున్నందుకు చాలా బాధపడ్డాడు కార్తీక్. జనంలో కేశవయ్య కోసం నలుమూలలా గాలించాడు. ఆయన ఎక్కడా కనిపించలేదు.

ఇంతలో పెళ్లి మండపం వద్ద ఒక గంభీరమయిన కంఠం వినిపించింది.

"పెళ్లి జరుగుతుంది. దయవుంచి అందరూ కూర్చోండి" అది కేశవయ్య కంఠం. అక్కడ కేశవయ్య నిలబడి ఉన్నాడు.

ఆ గొంతులో ఏం మత్తు ఉందో, ఎలాంటి ఆజ్ఞ ఉందో, అందరూ ఎక్కడివాళ్లక్కడ కూర్చున్నారు. "అంతంత మాత్రం స్థితి గల ఈ పెద్దమనిషి అంత డబ్బు ఎక్కడ తేగలడు" అనుకున్నాడు అమ్మాయి తండ్రి, దూరపు బంధువయిన కేశవయ్యను చూస్తూ.

కేశవయ్య ఏమీ పట్టించుకోకుండా తన భుజాన ఉన్న పెద్ద టవలును ఒక కొస భుజంమీద ఉంచి, మరోకొస విశాలంగా జాపి "ఈ జోలెలో మీ చందాలు వేయండి" అంటూ జనంలోకి వచ్చాడు. పెళ్లికుమార్తె తండ్రి వారించినా వినలేదు.


అప్పటివరకు జరిగిన సంఘటన కళ్లారా చూసి ఉండడం వల్ల అందరి హృదయాలు కరిగి ఉన్నాయి. కేశవయ్య ఆజ్ఞతో కూడిన అభ్యర్థన వల్ల అందరూ జోలెలో చందాలు వేయసాగారు. డబ్బేకాదు, వాచీలు, ఉంగరాలు మగవాళ్లు వేస్తే, ఆడవాళ్లు గాజులు, నగలు తీసివేశారు చలించిపోయి. కేశవయ్య టవలు నిండిపోయింది. మరో ఇద్దరి సహాయం తీసుకొని డబ్బు లెక్క గట్టి, వస్తువుల్ని విలువ కట్టారు. అంతా కలిపి డెబ్బయిఐదు వేలకు వచ్చింది.

కేశవయ్య ఆ డబ్బును, వస్తువుల్ని అందరిముందూ పెండ్లికుమారుడి తండ్రికి అందజేశాడు. అతను ఏమాత్రం సిగ్గుపడకుండా వాటిని తీసుకున్నాడు. మిగతా ఇరవైఐదు వేలూ రెండు నెలల్లో ఇస్తానని ఒప్పుకున్నాడు పెళ్లికుమార్తె తండ్రి.

"కానివ్వండి పెళ్లి" ఆజ్ఞతో కూడిన కేశవయ్య కంఠస్వరానికి అంతా నిశ్శబ్దమయిపోయారు.

మంగళవాయిద్యాలు మ్రోగాయి.

## టాబూ దబాయింపు



నేను ఇండస్ట్రీకొచ్చి ఇంతకాలం అయినా ఇంకా నన్ను అందరూ కొత్తగానే చూస్తున్నారు. ఎంత చేసినా ఇంకా కొంత చేయాలనిపిస్తుంది. నన్ను అందరూ ఫ్రెష్‌గా చూడ్డంలోనే ఆనందం వుంది. ప్రొఫెషనల్‌గానో, సీనియర్ మోస్ట్‌గానో చూస్తే ఇంకేవుంది. ఫినిష్!

మీరు నమ్మాలి. ఇప్పటికీ సెట్‌లో ఏదైనా సినిమా ప్రారంభంలో టెన్షను ఫీలవుతాను. ఆ కేరక్టర్ని నాలో పూర్తిగా జీర్ణించుకున్నంత వరకూ. సో అయామ్ హ్యాపీ. నాకు ఒకటీ అరా సినిమాలుంటే చాలు దక్షిణాదిలో నా డిమాండ్ నాకుంది అంటోంది టాబూ.

*(ఎంత దబాయిస్తోంది తెలుగులో ఎన్ని సినిమాలున్నై?)*

తలవంచుకొన్న పెళ్లి కుమార్తె మెడలో తాళికట్టాడు పెండ్లి కుమారుడు. అది స్త్రీ సిగ్గుతో తలవంచుకోవడం కాదు. అవమాన భారంతో వంచుకున్న తల అది.

సాయంత్రం నాలుగు గంటలకు పెండ్లి కార్యక్రమం అయిపోయింది. కేశవయ్యతో కలసి తిరుగు ప్రయాణమయ్యాడు కార్తీక్. దారిపొడవునా కేశవయ్య మంచి హృదయాన్ని, పెద్దరికంగా అతను నడిపించిన వ్యవహారాన్ని పొగుడుతూనే ఉన్నాడు కార్తీక్. కేశవయ్య మాత్రం కొత్త పెళ్లికూతురు అందాన్ని, గుణాన్ని, వినయాన్ని అటువంటి క్లిష్టపరిస్థితిలో చూపిన సహనాన్ని పదేపదే మెచ్చుకుంటూనే ఉన్నాడు.

ఇద్దరూ ఒంగోలు చేరారు. కార్తీక్ బలవంతం మీద కేశవయ్య ఆ రాత్రి కార్తీక్ ఇంటికి వచ్చి అతని ఆతిథ్యం స్వీకరించాడు. ఆరోజు నుండి కేశవయ్య, ఎప్పుడు వ్యవసాయ పనులమీద ఒంగోలు వచ్చినా తప్పక కార్తీక్‌ని కలిసేవాడు. రాత్రి పొద్దుబోతే కార్తీక్ ఇంట్లోనే ఉండి తెల్లవారి గ్రామానికి వెళ్లేవాడు.

ఇలా ఆరునెలలు వీళ్ల ఆత్మీయతా అనురాగాలతో కూడిన స్నేహం జరుగుతూ ఉంది. ఈ మధ్య కాలంలో కార్తీక్‌ను గురించి బాగా తెలుసుకున్నాడు. ఇతనికి తల్లి మాత్రమే ఉంది. తండ్రి చిన్నతనంలోనే చనిపోయాడు. ఎంతో కష్టపడి చదివి ఈ స్థాయికి వచ్చాడు. ఇతనికి అమ్మాయినిస్తామని బంధువర్గంలోని ఎంతోమంది ముందుకు వచ్చారు. కాని ఇతడు అందర్నీ తిరస్కరించాడు. కారణం తనను, తన తల్లిని కష్టకాలంలో ఎవరూ ఆదరించలేదు.

ఇవన్నీ చెప్పి మంచి అమ్మాయిని చూడమని కేశవయ్యను ప్రాధేయపడేది కార్తీక్ తల్లి. వృద్ధాప్యం ముంచుకొస్తున్న ఆమెకు కోడలు అవసరం ఎంతైనా ఉంది. కేశవయ్య రెండు, మూడు మంచి సంబంధాలు తెచ్చాడు. తాను పెళ్లి చూపులకు రానని, తనకు పెళ్లి చేసుకునే ఆలోచనే లేదని ఎంతో మర్యాదగా చెప్పాడు కార్తీక్. ఇక భవిష్యత్తులో పెళ్లి ప్రస్తావన కూడా తేవద్దని కోరాడు. కేశవయ్యకు కూడా ఏంచేయడానికి పాలుపోలేదు.

రోజులు గడుస్తున్నాయి. ఆరోజు కార్తీక్ గుంటూరుకు వెళ్లి జీతం చెక్కు డ్రా చేసుకొని బ్యాంకు కెదురుగా ఉన్న హోటల్లో భోంచేసి బయటికి వచ్చాడు. ఎదురుగా వస్తూ కనిపించాడు కేశవయ్య.

“ఏంసార్! ఇలా వచ్చారు” అని అడిగాడు కార్తీక్ ఆశ్చర్యంగా, దగ్గరకు వెళ్లి.

“ఈ ఊళ్లోనే ఆర్నెల్ల క్రితం ఎంతో గందరగోళం మధ్య జరిగిన శ్యామల పెళ్లి నీకు గుర్తుండే ఉంటుందనుకుంటాను. మళ్లీ ఏదో జరిగుంటుంది. వెంటనే రమ్మని ఉత్తరం వ్రాసాడు ఆమె తండ్రి. వాళ్లిల్లు ఆరోజు జరిగిన కళ్యాణమంటపంనుంచి నాలుగో ఇల్లు. ఆరోజు పెద్దరికం వహించి పెళ్లి చేశాను కదా. ఈరోజు మళ్లీ రమ్మన్నారు. ఏదో సమస్య వచ్చుంటుంది. వాళ్లకి దగ్గర మనుషులు అంతమందున్నా నన్నే పిలిపించాడు”.

“మీరు ఎన్ని సమస్యలొచ్చినా సమయస్ఫూర్తితో పరిష్కరించగలరు. ఆరోజు ఆ పెళ్లి దృశ్యం ఇంకా నా మదిలో ఇప్పుడు జరిగినట్లే ఉంది. ఆనాటి మీ పరిష్కారం కూడా ఎంతో వివేకవంతంగా ఉంది” మెచ్చుకున్నాడు.

“భోంచేద్దురుగాని రండి” అని కార్తీక్ హోటల్లోకి ఆహ్వానిస్తే ఒప్పుకోలేదు కేశవయ్య. భోంచేసి వెళ్తే శ్యామల తండ్రి రాజారావు బాధపడతాడని, అక్కడికే వెళ్లి భోంచేస్తానని చెప్పాడు. చివరకు కార్తీక్ బలవంతంమీద కేశవయ్య ప్రక్కనున్న కూల్‌డ్రింక్ షాపులోకి అతనితోబాటు నడిచాడు.

“ఎండలో వచ్చారు. ముందు ఇది త్రాగండి” అంటూ కూల్ డ్రింక్ తెప్పించి కేశవయ్యకు అందించాడు.

కేశవయ్య కూల్‌డ్రింక్ త్రాగిన తరువాత “మీరేమనుకోకపోతే ఒకమాట” అన్నాడు కార్తీక్.

“చెప్పు. కార్తీక్”

“నా డైరీలో మీరో మంచి మాట వ్రాసి (ఆటోగ్రాఫ్) సంతకం పెట్టండి. ఎన్నాళ్లనుంచో అనుకొంటున్నాను”.

“ఏమిటయ్యా నీ చాదస్తం. ఆటోగ్రాఫ్‌లు సినిమాస్టార్లు, క్రీడాకార్లు మొదలయిన పెద్దవాళ్ల దగ్గర తీసుకోవడం చూశాను గాని, మట్టి పిసుక్కునే నాలాంటి వాడి దగ్గర ఆటోగ్రాఫ్‌లు ఏమిటయ్యా. నీ పిచ్చిగాని”

“మీరు అంతకంటె గొప్పవాళ్లు. ఏదో ఒకటి వ్రాయండి. ఏ సమస్య వచ్చినా మీ సంతకం చూస్తే నాకు ధైర్యమొస్తుంది. కాదనకండి” అంటూ ఆఖరిపేజీ తీసి డైరీ అతని ముందు పెట్టాడు.

ఇంతలో ఒకతను ప్రవేశించి “అబ్బ కార్తీక్.

## సైనికులూ - జర్నలిస్టులు

సరిహద్దులలో దురాక్రమణలను
అరికట్టేది సైనికులు
సంఘంలోని దురాగతాలను
ఎండ గట్టేది జర్నలిస్టులు
దేశసంపదని కాపాడేది సైనికులు
దేశ సంస్కృతిని సంరక్షించేది జర్నలిస్టులు
సైనికులది దేశభక్తి నినాదం
జర్నలిస్టులది మానవతావాదం
సైనికాధికారులు పొరుగుదేశాలకు
అమ్ముడై పోతే -
సైనికులు దేశాన్ని దక్కించుకోలేరు.
పత్రికాధిపతులు స్వార్థానికి లొంగిపోతే
జర్నలిస్టులు సంఘాన్ని
సరిదిద్దలేరు.

*- టి.యస్.యస్. రంగానాధ్*

నేనుకొన్నట్లు ఇప్పుడే రాలేను" అంటూ అన్ని ప్రక్కన నిలిచి "నీకే విషయం తెలుసా. మన అకౌంటెంటు చెంగల్రావుకు యాక్సిడెంటు అయింది. హాస్పిటల్లో చేర్చారు" అన్నాడు. అతను కార్తీక్ ఫ్రెండ్.

కార్తీక్ హడావుడిగా కేశవయ్యను సమీపించి, "మాస్టారూ. నేను అర్జంటుగా వెళ్లాలి. మా కంపెనీ అకౌంటెంట్ చెంగల్రావుకు ఏక్సిడెంటు అయిందట. హాస్పిటల్‌కి వెళ్లాలి. మళ్లీ వచ్చి మిమ్మల్ని కలుస్తాను" అంటూ డైరీ కూడా తీసుకోవడం మరచిపోయి హడావుడిగా వెళ్లిపోయాడు.

హాస్పిటల్‌కు వెళ్లి మిత్రుడ్ని పరామర్శించి, నాలుగు గంటల ప్రాంతంలో కేశవయ్య చెప్పిన గుర్తుల ప్రకారం రాజారావు ఇంటికి చేరాడు. అదొక చిన్న డాబా ఇల్లు.

గేటు తీసుకొని లోపలికి రాగానే వరండాలో ఒక అందమైన అమ్మాయితో మాట్లాడుతున్నాడు కేశవయ్య. ఆ అమ్మాయి అచ్చం నాటి పెళ్లి కుమార్తె శ్యామలలాగే ఉంది. శ్యామల భర్త దగ్గరకు వెళ్లక ఇక్కడెందుకుంది అనుకొన్నాడు.

"రావయ్యా రా. ఇప్పుడే నీమాటనుకుంటున్నాము" అంటూ ఆహ్వానించాడు కేశవయ్య.

"శ్యామలా. ఈ అబ్బాయే నా మిత్రుడు కార్తీక్. ఇప్పుడు ఇద్దరం ఒంగోలుకు కలిసే వెళ్తాం."

"నమస్కారం" అన్నాడు కార్తీక్.

"నమస్కారం" మృదుమధురంగా అంది శ్యామల. ఎంతో ఆసక్తిగా కార్తీక్‌ను పైనుంచి క్రిందికి తేరపార జూసింది. తరువాత చిరునవ్వు నవ్వింది.

కార్తీక్‌కి సిగ్గనిపించింది. అరవై ఏళ్ల పెద్దమనిషి, ముప్ఫయిఏళ్ల తనని మిత్రుడు అనేసరికి ఆమెకు ఆశ్చర్యంగా ఉన్నట్లుంది. అయినా ఈ కేశవయ్యగారు తనను మిత్రుడు అనడమేమిటి? శిష్యుడనో లేక పరిచయస్తుడని అన్నా ఆమె ఇంత ఆశ్చర్యపడకపోను అనుకున్నాడు.

"కాఫీ తెస్తాను" అంటూ లోపలికి వెళ్లింది శ్యామల.

"అమ్మాయి సౌందర్యరాశి. సుగుణాలపుట్ట. కాని ఆ అమ్మాయి జీవితమంతా కష్టాలు, అగచాట్లు" అంటూ తన ఆవేదనను చాటుకున్నాడు కేశవయ్య.

"మళ్లీ ఏమయినా అవాంతరమొచ్చిందా మాస్టారూ...." ఆతృతగా అడిగాడు కార్తీక్.

"అవాంతరమేమిటి? ఈ ఆరునెలల్లో ఆమె తండ్రి తమకివ్వవలసిన పాతికవేలు ఇవ్వలేకపోయాడని ఆ అమ్మాయిని భర్తతో మాట్లాడనీయలేదు. భర్త గదిలోకి పంపలేదు. ఆ అమ్మాయి రాత్రుళ్లు గదిముందు క్రింద కొంగు పరుచుకొని పడుకొంటే, ఆమె భర్త తన ఉంపుడుగత్తెలతో రాత్రంతా కులికేవాడట. ఇది తెలిసే అతని తల్లిదండ్రులు మిన్నకుండేవారట. మిగతా పాతికవేలు తెస్తేనే గదిలోకి ప్రవేశమని అతని తల్లిదండ్రి ఖచ్చితంగా చెప్పేశారట. ఆ అమ్మాయి ఈ విషయం అటు తల్లిదండ్రులకు చెప్పలేక ఇటు ఆ నరకంలోనూ ఉండలేక కుమిలి పోయింది. శ్యామల చూసి చూసి ఇక ఆ వ్యభిచారి భర్తముఖం చూడ్డానికే అసహ్యమేసి స్వతంత్రంగా బ్రతుకుదామని ఇల్లు వదిలి వచ్చేసింది."

"మంచి నిర్ణయం తీసుకొంది మాస్టారూ" మెచ్చుకున్నాడు కార్తీక్.

"కాని ఆమె తల్లిదండ్రులు నన్ను పిలిపించింది, మళ్లీ వాళ్లిద్దర్నీ కలపమని. తామే ఎక్కడయినా పాతికవేలు అప్పు తెచ్చిస్తారట."

"అయ్యో పాపం".

"అయ్యో పాపం ఏమిటి? నేనే దీనికి ఒప్పుకోలేదు. శ్యామల చేత విడాకులు అప్లయి చేయిద్దామన్నాను."

"ఆమె ఏమంది మాస్టారూ".

"ఎంతో సంతోషించింది. అంతేకాదు. ఆమె తల్లిదండ్రులను కూడా ఒప్పించాను".

ఇంతలో శ్యామల వచ్చింది.

"తీసుకోండి కాఫీ" అంటూ ఇద్దరికీ కాఫీలు అందించింది.

శ్యామలను అప్పుడు తేరిపార జూశాడు కార్తీక్. ఆమె ముఖంలో స్థిర నిర్ణయం. కొత్త వెలుగు కనిపించాయి.

"అమ్మాయ్. కార్తీక్ డైరీ తీసుకురా అమ్మా" అన్నాడు కేశవయ్య. శ్యామల లోపలికి వెళ్లింది.

"సార్. నా డైరీ ఆమె దగ్గరుందా" కంగారు పడిపోయాడు కార్తీక్. నవ్వాడు కేశవయ్య. "అమ్మాయి నీకు నచ్చిందా"

"నాకు నచ్చడమేమిటి?" కంగారుగా అన్నాడు కార్తీక్.

"నాకు అంతా తెలుసులేవయ్యా. నువ్వు శ్యామలను ప్రేమిస్తున్నావు. శ్యామల పెళ్లిరోజు నా కండువాలో వేసిన కొత్త వందరూపాయల నోట్లకట్ట పదివేల రూపాయలు నువ్వేసినవనీ, నీ జీతమని నీ డైరీ చెప్పింది. పెళ్లయిన అమ్మాయిని గురించి ఆలోచించకూడదంటూనే నువ్వు శ్యామల అందం గురించి, మంచితనం గురించి ఆలోచనలు ఆపలేకపోతున్నావని, అలాంటి అమ్మాయి ఇక దొరకదు కనుక పెళ్లి ఆలోచనలు మానుకున్నావని నీ డైరీ చదివి తెలుసుకున్నాను".

"సార్" భయంగా అన్నాడు కార్తీక్.

"ఏం ఫరవాలేదు లేవయ్యా. నీ గురించి అమ్మాయికంతా చెప్పి, చదవమని నీ డైరీ నేనే శ్యామల కిచ్చాను. మీ ఇద్దరికీ ఈడూ జోడూ బాగుంటుంది" నవ్వుతూ అన్నాడు కేశవయ్య.

శ్యామల లోపలనుంచి డైరీతో వచ్చింది.

"అమ్మా! డైరీ పూర్తిగా చదివి. ఏమను కున్నావు?"

"సాక్షాత్తు భగవంతుడే వచ్చి తన గుండె తెరచి రమ్మని ఆహ్వానిస్తే కాదనే మూర్ఖులెవరైనా ఉంటారా" క్రీగంట కార్తీక్‌ని చూసి సిగ్గుతో తలవంచుకుంది.

ఇంతలో గుడికి వెళ్లిన శ్యామల తల్లిదండ్రులు పూలసజ్జతో తిరిగివచ్చారు.

"వాళ్లకంతా తెలుసు. మీ ఇద్దరి కోసమే గుడికెళ్లి పూజచేసి వస్తున్నారు. ఇద్దరూ పాద నమస్కారాలు చేయండి" అన్నాడు కేశవయ్య.

శ్యామల, కార్తీక్ ఒకరి ముఖాలు ఒకరు చూసుకుని ముసిముసిగా నవ్వుకున్నారు.

శ్యామల తల్లిదండ్రులకు నమస్కారం చేయబోతున్న వాళ్లల్లా, వారి సైగతో తటాలున కేశవయ్య పాదాలకు ఒంగి నమస్కరించారు. శ్యామల తల్లిదండ్రులు అందించిన పూల సజ్జలోని పూలను వాళ్ల నెత్తిన చిలకరించి 'పిల్లాపాపలతో చల్లగా ఉండమని' మనస్ఫూర్తిగా దీవించాడు కేశవయ్య. ❃

